క్లుప్తంగా

దసరా ఉత్సవాలకు శ్రీకారం



ఉదయగిరి రూరల్: పట్టణంలోని బీసీ కాలనీ సమీపంలో ఉన్న సంతానలక్ష్మి ఆలయంలో ఈ నెల 22 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు దసరా ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నారు. అందులో భాగంగా సోమవారం మహిళలు పసుపు దంచి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మైనింగ్ అనుమతులు రద్దు చేయాలని వినతి



వరికుంటపాడు: మండలంలోని కనియంపాడు, భాస్కరాపురం గ్రామాల పరిధిలోని సర్వేనంబర్లు 233, 1లో మైనింగ్‌కు ఇచ్చిన అనుమతులను రద్దు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరారు. ఈ మేరకు నెల్లూరులోని కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో జాయింట్ కలెక్టర్ శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రజల అభీష్టానికి విరుద్ధంగా మైనింగ్ అనుమతులు మంజూరు చేశారని విన్నవించారు. స్పందించిన జేసీ త్వరలోనే మైనింగ్‌కు కేటాయించిన ప్రాంతాన్ని పరిశీలించి తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. సర్పంచ్ కొండిపోగు దిలీప్‌కుమార్, మేధావుల ఫోరం సభ్యుడు సరాబు లక్ష్మీనారాయణ, హ్యూమన్ రైట్స్ స్టేట్ కన్వీనర్ చల్లగాలి వెంకటమోహన్, టీడీపీ నాయకుడు షేక్ పీరయ్య పాల్గొన్నారు.

పరామర్శ



సోమశిల: అనంతసాగరం మండలం ఆమనిచిరివెళ్ల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు సుబ్బారావును మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన సుబ్బారావు నెల్లూరులోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న మేకపాటి ఆస్పత్రికి వెళ్లి సుబ్బారావును పరామర్శించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బిజివేముల పిచ్చిరెడ్డి ఉన్నారు.

ఎంపీడీఓ బదిలీ

సీతారామపురం : మండల ఎంపీడీఓ సాయిప్రసాద్ తిరుపతి జిల్లాకు బదిలీ అయ్యారు. డిప్యూటీ ఎంపీడీఓగా పనిచేస్తున్న సాయిప్రసాద్ ఎఫ్‌ఏసీపై మండల ఎంపీడీఓగా గత నెలలో బాధ్యతలు చేపట్టారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం డిప్యూటీ ఎంపీడీఓలకు పదోన్నతి కల్పించిన నేపథ్యంలో సాయిప్రసాద్ పదోన్నతి పొంది తిరుపతి జిల్లాకు బదిలీ అయినట్లు తెలిసింది. త్వరలో ఆయన మండలం నుంచి రిలీవ్ కానున్నట్లు సమాచారం.

స్టార్టర్ దగ్ధంపై ఫిర్యాదు

దుత్తలూరు: దుత్తలూరు పంచాయతీ పరిధిలోని కట్టకిందపల్లి ఎస్సీకాలనీలోని రక్షిత మంచినీటి పథకం మోటార్‌కు సంబంధించిన స్టార్టర్ సోమవారం వేకువజామున దగ్ధమైంది. స్టార్టర్ షార్ట్‌సర్క్యూట్ వల్ల దగ్ధమైందా లేక ఎవరైనా కావాలని దహనం చేశారా అని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తూ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి షేక్ నజీముల్లా దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన ఘటనా స్థలాన్ని పరిశీలించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంచినీటి సమస్య తలెత్తకుండా కొత్త స్టార్టర్‌ను ఏర్పాటు చేశారు.

కలప అక్రమ తరలింపుపై ఫిర్యాదు

దగదర్తి: దగదర్తి చెరువులోని నల్లతుమ్మ, ఇతర చెట్లను తమ పార్టీకి చెందిన కొందరు అక్రమంగా నరికి తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని టీడీపీ నాయకుడు మాలేపాటి రవీంద్రనాయుడు రైతులతో కలిసి తహసీల్దార్ పీ కృష్ణతో పాటు పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. చెరువులోని చెట్లను అక్రమంగా నరికి కలపను తరలిస్తున్నా అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరించడం తగదన్నారు. కలపను రవాణా చేసేందుకు చెరువుకట్టను సైతం ధ్వంసం చేశారని, ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని విన్నవించారు. కలప అక్రమ తరలింపును వెంటనే నిలిపివేసి అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

మిగులు పొగాకు కొనుగోలుకు అనుమతులు

కలిగిరి: అధికారికంగా, అనధికారికంగా పండించిన పొగాకు కొనుగోలుకు కేంద్ర ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసిందని కలిగిరి పొగాకు వేలం కేంద్రం నిర్వహణాధికారి వీ శివకుమార్ సోమవారం తెలిపారు. 2024–25 పంట కాలానికి సంబంధించిన పంటను సర్వీసు చార్జీలతో కొనుగోలు చేస్తామని వివరించారు.

- గతంలో రైతులకు అండగా నిలిచిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- ప్రస్తుతం రైతులను పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- యూరియా కోసం రైతులు పడిగాపులు
- పంటలకు లభించని గిట్టుబాటు ధరలు
- నేడు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో అన్నదాత పోరు

అన్నదాతకు అష్టకష్టాలు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులకు అన్ని విధాలా అండగా నిలిచింది. రైతులు ఊరు దాటకుండానే ఆర్బీకేల ద్వారా విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను ఇంటి ముంగిటకే సరఫరా చేసింది. కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి పంటలను గిట్టుబాటు ధరలకు అమ్ముకునే అవకాశం కల్పించింది. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక రైతులకు అష్టకష్టాలు మొదలయ్యాయి. రైతుసేవా కేంద్రాలను నిర్వీర్యం చేయడంతో యూరియా కోసం సొసైటీల వద్ద రైతులు పడిగాపులు పడుతున్నారు. పంటలను దళారులు అడిగిన ధరకు తెగనమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో అన్నదాతలకు అండగా వైఎస్సార్‌సీపీ మంగళవారం అన్నదాత పోరు కార్యక్రమాన్ని చేపడుతోంది.

ఆత్మకూరు: కూటమి ప్రభుత్వం రైతులను ఆదుకోవడంలో అన్ని విధాలా వైఫల్యం చెందిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఏడాదిన్నర పాలనలో రైతు సేవా కేంద్రాలను నిర్వీర్యం చేయడంతో రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. గత ప్రభుత్వంలో మాదిరిగా రైతు సేవా కేంద్రాల ద్వారా అన్ని రకాల సేవలు అందుతాయని ఆశించిన రైతులకు నిరాశే ఎదురైంది. వాటి ద్వారా విత్తనాలు, ఎరువులు సక్రమంగా అందించకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

యూరియా కోసం పడిగాపులు

ఆత్మకూరు నియోజకవర్గంలో 30వేలకుపైగా ఎకరాల్లో ఎడగారు సాగు చేపట్టారు. అందుకనుగుణంగా యూరియాను సరఫరా చేయాల్సిన కూటమి ప్రభుత్వం చేతులెత్తేసింది. దీంతో రైతులు ఆర్బీకేలు, సొసైటీల వద్ద రైతులు పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది. అయినా పంటకు సరిపడా యూరియాను అందజేయకపోవడంతో ప్రైవేట్ దుకాణాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇదే అదనుగా ప్రైవేట్ వ్యాపారులు రూ.265 యూరియా బస్తాను రూ.385కు విక్రయించి రైతులను దోచుకున్నారు. దీంతో ఎకరాకు రూ.2వేల వరకు అదనంగా పెట్టుబడులు అయ్యాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



సొసైటీ తెరవకముందే యూరియా కోసం బారులుతీరిన రైతులు (ఫైల్)

పంటలకు లభించని గిట్టుబాటు ధరలు

ఆత్మకూరు నియోజకవర్గంలో సుమారు 30వేల ఎకరాల్లో ఎడగారు సాగు చేశారు. ప్రస్తుతం పంట నూర్పిళ్లు చేపడుతున్నారు. గత ప్రభుత్వంలో ధాన్యం పుట్టి రూ.22 వేల నుంచి రూ.24 వేల వరకు పలికింది. ప్రస్తుతం ఎడగారు ధాన్యం అమ్ముకునేందుకు రైతులు ఆపసోపాలు పడాల్సి వస్తోంది. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో మిల్లర్లతో కుమ్మక్కై దళారులు ధరలు తగ్గించేశారు. ప్రస్తుతం పుట్టికి రూ.15,500ల నుంచి రూ.16 వేలు మాత్రమే చెల్లిస్తున్నారు. మిగిలిన పంటలకు కూడా గిట్టుబాటు ధరలు లేకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో పొగాకుకు మంచి ధరలు లభించడంతో రైతులు ఆదాయాన్ని పొందారు. ఈ ఏడాది పొగాకు గరిష్ట ధర రూ.280కు మించకపోవడంతో రైతులు నష్టపోయారు. మిర్చి, పత్తి ధరలు కూడా పతనమవడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ రైతుల ప్రయోజనాలను కోరుతూ వారికి ప్రభుత్వం సాయం అందించి ఆదుకోవాలని ఆత్మకూరు, కావలి రెవెన్యూ డివిజన్ల అధికారులకు మంగళవారం వినతిపత్రాలను అందజేయనుంది.

పొగాకుకు గిట్టుబాటు ధరల్లేవు



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పొగాకుకు మంచి ధరలు లభించడంతో మంచి ఆదాయం వచ్చింది. ఈ ఏడాది పదెకరాల్లో పొగాకు సాగుచేశా. సాగు ఖర్చులు కూడా పెరిగాయి. అందకనుగుణంగా వేలంలో పొగాకుకు గిట్టుబాటు ధరలు లభించలేదు. కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో నష్టపోయా.

– పత్తిపాటి హజరత్తయ్య, పొగాకు రైతు, డీసీపల్లి

పెట్టుబడులు పెరిగాయి



ఈ ఏడాది ఎడగారు సాగుకు సరిపడా యూరియాను ప్రభుత్వం సరఫరా చేయలేదు. ఆర్బీకేలు, సొసైటీల్లో యూరియా లభించకపోవడంతో వ్యాపారుల వద్ద అదనంగా చెల్లించి కొనుగోలు చేయాల్సి వచ్చింది. వ్యాపారులు కాంప్లెక్స్ ఎరువులను కొంటేనే యూరియాను ఇస్తామనడంతో వాటిని కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో ఎకరాకు రూ.1500 నుంచి రూ.2 వేల వరకు పెట్టుబడులు అదనంగా పెరిగాయి.

– నిజమాల నరసింహులు, రైతు, మహిమలూరు

యూరియా కోసం ఇబ్బందులు పడ్డాం



ఈ ఏడాది రైతులు రెండో కారు అధికంగా సాగు చేశారు. అందుకనుగుణంగా ప్రభుత్వం యూరియాను సరఫరా చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డాం. ఓ వైపు పైరును కాపాడుకుంటూ మరో వైపు యూరియా కోసం దుకాణాల వద్ద పడిగాపులు కాయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. అయినా ఒక్కటి, రెండు సార్లు మాత్రమే యూరియాను ఎమ్మార్పీకి తెచ్చుకున్నాం. ఆ తరువాత వ్యాపారుల వద్ద అధిక ధర చెల్లించి తెచ్చుకున్నాం.

– దేగా కృష్ణయ్య,యాదవ్, రైతు, తరుణవాయి

ధర్నాలు చేయాల్సి వచ్చింది



ఈ ఏడాది ఎడగారుకు నార్లు పోసినప్పటి నుంచి యూరియా కోసం తిప్పలు పడాల్సి వచ్చింది. మండల కేంద్రంలో యూరియా కోసం ధర్నాలు చేయాల్సి వచ్చింది. అయినా కూడా ఒక్కో రైతుకు ఐదు బస్తాలు మాత్రమే ఇచ్చారు. దీంతో ఎరువుల డీలర్ల వద్ద బస్తాకు రూ.120 అధికంగా చెల్లించి యూరియాను కొనుగోలు చేయాల్సి వచ్చింది.

– బిల్లుపాడు శ్రీనివాసులు, రైతు, వెంగంపల్లి

అన్నదాత పోరు జయప్రదానికి పిలుపు



సీతారామపురం: అన్నదాత పోరు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆత్మకూరు: పంటలకు సరిపడా యూరియా లభించక, పంటలకు గిట్టుబాటు ధరలు లేక ఇబ్బందులు పడుతున్న రైతులకు అండగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఆత్మకూరులో మంగళవారం అన్నదాత పోరు కార్యక్రమాన్ని చేపడుతున్నట్లుగా మేకపాటి కార్యాలయం సోమవారం ఒక ప్రకటనలో పేర్కొంది. మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు మున్సిపల్ బస్టాండ్ వద్ద నుంచి ర్యాలీగా ఆర్డీఓ కార్యాలయానికి చేరుకుని ఆర్డీఓకు వినతిపత్రం అందజేయనున్నట్లు తెలిపారు. ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని అన్ని మండలాల రైతులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

కలిగిరి/జలదంకి/వరికుంటపాడు/ సీతారామపురం: రైతుల సమస్యల పరిష్కారానికి వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో మంగళవారం చేపడుతున్న అన్నదాత పోరు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ పార్టీ కలిగిరి, జలదంకి, వరికుంటపాడు, సీతారామపురం మండలాల అధ్యక్షులు కాటం రవీంద్రరెడ్డి, ఇస్కా9మదన్‌మోహన్‌రెడ్డి, తిరుపతి నాయుడు, చింతంరెడ్డి సుబ్బారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఉదయం 9గంటలకు ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో జమ్మలపాళెంలోని ఎస్వీఆర్ కల్యాణ మండపం నుంచి ర్యాలీగా బయలుదేరి కావలి ఆర్డీఓ కార్యాలయానికి చేరుకుని వినతి పత్రం అందజేయనున్నట్లు వివరించారు. ఉదయగిరి నియోజకవర్గంలోని రైతులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ముగిసిన వేళాంగిణి మాత ఉత్సవాలు



సీతారామపురం : స్థానిక అరుంధతీయవాడలో జరుగుతున్న వేళాంగిణి మాత ఉత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఉదయం ఒంగోలు విచారణ గురువు డీఎస్ పాల్ ఆధ్వర్యంలో సమిష్టి దివ్యబలి పూజను నిర్వహించారు. సాయంత్రం వేళాంగిణి మాత తేరు ఉత్సవాన్ని నిర్వహించారు. విచారణ గురువులు బెర్నాడ్, వరప్రసాద్ పాల్గొన్నారు.

ఈ నీటిని తాగేదెలా?



సోమశిల: మండల కేంద్రమైన అనంతసాగరంలో పంచాయతీ కుళాయిల ద్వారా కలుషిత నీరు సరఫరా అవుతున్నాయి. గత నాలుగురోజులుగా కుళాయిల్లో ఎర్రగా నీరు వస్తుండడంతో తాగునీటికి స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. కలుషిత నీటిని తాగితే వ్యాధులు బారిన పడుతామని భయంతో మినరల్ వాటర్‌ను కొనుగోలు చేసి తాగుతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

వేతనాలు పెంచాలని వినతి

ఉదయగిరి రూరల్: ఉదయగిరి మేజర్ పంచాయతీలో పనిచేసే పారిశుధ్య కార్మికుల వేతనాలను పెంచి ఆదుకోవాలని రాష్ట్ర గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు గడ్డం నాగేశ్వరరావు కోరారు. ఈ మేరకు ఉదయగిరి పంచాయతీ కార్యాలయానికి సోమవారం వచ్చిన ఆత్మకూరు డీఎల్‌డీఓ టీ రమణయ్యకు పారిశుధ్య కార్మికులతో కలిసి వినతిపత్రం అందజేశారు. పంచాయతీలో పారిశుద్ధ్య, పీడబ్ల్యూఎస్ కార్మికులు, ఎలక్ట్రీషియన్లు పనిచేస్తున్నారన్నారు. పంచాయతీ నిధుల లభ్యతను బట్టి కార్మికులకు వేతనాలు పెంచి ఇవ్వాలని డీపీఓ సర్క్యులర్ జారీ చేశారని తెలిపారు. ఏటా ఉదయగిరి పంచాయతీకి 15వ ఆర్థిక సంఘం, సాధారణ నిధులు రూ.1.40 కోట్ల వరకు వస్తాయన్నారు. అందకనుగుణంగా కార్మికుల వేతనాలు పెంచాలని విన్నవించారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



వరికుంటపాడులో ఉపాధ్యాయుడికి సత్కారం

వరికుంటపాడు: మండల విద్యావనరుల కేంద్రంలో గురుపూజోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి ఎంఈఓలు గుత్తి కొండయ్య, రమణయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మండల ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 15 మందిని శాలువాలతో సత్కరించి పురస్కారాలను అందజేశారు.

ఆత్మకూరురూరల్: మహిమలూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురుపూజోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఉపాధ్యాయులు నరసింహారావు, రవి నాయుడు, బాలకోటేశ్వరరావు, శివకుమార్, అనిల్‌కుమార్, అఫ్రోజ్, షఫీ, శ్యామల, అరుణ, శైలజ, అల్లం మాధవి, తదితరులను హెచ్ఎం భాస్కర్‌రెడ్డి ఘనంగా సత్కరించారు.

ప్రభుత్వ భూముల్లోని జామాయిల్ చెట్ల నరికివేత



జామాయిల్‌ను అక్రమంగా నరికి ట్రాక్టరులో లోడు చేస్తున్న కూలీలు

ఉదయగిరి: మండలంలోని తిరుమలాపురంలో సర్వే నంబర్లు 274, 297, 304లో ఉన్న ప్రభుత్వ భూమిలోని జామాయిల్ చెట్లను కొందరు అక్రమార్కులు అక్రమంగా నరికి సొమ్ము చేసుకుంటున్నారు. సోమవారం కొందరు గ్రామస్తులు ప్రభుత్వ భూముల్లోని జామాయిల్ చెట్లను నరుకుతున్న అక్రమార్కులను అడ్డుకున్నారు. అనంతరం పోలీసు, రెవెన్యూ సిబ్బందికి సమాచారం అందజేశారు. దీంతో వీఆర్వో రాజేష్ ఘటనా స్థలానికి చేరుకుని జామాయిల్ అక్రమ నరికివేత పనులు నిలిపివేయించారు. ఈ సందర్భంగా వీఆర్వో విలేకరులతో మాట్లాడుతూ తిరుమలాపురంలోని ప్రభుత్వ భూముల్లో కొందరు అక్రమంగా జామాయిల్ సాగుచేస్తున్నారని, వాటిని నరికి అమ్ముకునే ప్రయత్నం చేయగా తాము అడ్డుకున్నామన్నారు. సమగ్రంగా సర్వే చేయించి ప్రభుత్వ భూముల్లోని చెట్లను నరికిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

అధ్వానంగా పారిశుద్ధ్యం



ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని 5వ వార్డు శివారు ప్రాంతంలో పారిశుద్ధ్యం అధ్వానంగా తయారైంది. బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద ఉన్న మున్సిపల్ స్థలంలో మురుగు నిల్వ చేరి దుర్గంధం వెదజల్లుతోంది. మరోవైపు దోమల విజృంభిస్తున్నాయి. దీంతో ఈ ప్రాంతంలో రెండు రోజుల వ్యవధిలోనే 20 మందికిపైగా జ్వరాలబారిన పడ్డారని, స్థానికులు తెలిపారు. గతంలో ఇదేవిధంగా జేఆర్‌పేట ఎక్స్‌టెన్షన్‌లో ఖాళీ ప్రదేశంలో మురుగు నిల్వ ఉండి దోమలు ప్రబలడంతో డెంగీ జ్వరం బారిన పడి ఓ యువ ఇంజనీర్ మృత్యువాత పడ్డాడు. అలాగే 20వ వార్డు పరిధిలోని ఎరుకలసానినగర్, హిల్ రోడ్డు ప్రాంతంలోనూ నిల్వ నీటి కారణంగా దోమలు వ్యాప్తి చెంది జ్వరాలబారిన పడి ఇద్దరు చిన్నారులు మృతి చెందారు. మున్సిపల్ సిబ్బంది శివారు ప్రాంతాల్లో పర్యటించి మురుగు నిల్వలను తొలగించి దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకుని జ్వరాల బారిన పడకుండా కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

తాగునీటి సరఫరాకు అంతరాయం రేపు

ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని పలువార్డుల్లో బుధవారం తాగునీటి సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాటర్ ట్రీట్మెంట్‌ప్లాంట్‌లో మోటార్ల నిర్వహణ పనులు చేపడుతున్న దృష్ట్యా 4, 5, 6, 7, 8, 9, 10, 11, 13, 15, 16, 17, 18 వార్డుల పరిధిలో సరఫరాను నిలిపివేస్తున్నామని చెప్పారు. గురువారం యథావిధిగా నీటిని సరఫరా చేస్తామని తెలిపారు.

స్వామిత్వ సర్వేను బాధ్యతగా చేపట్టాలి

ఉదయగిరి: స్వామిత్వ సర్వేను బాధ్యతగా చేపట్టాలని ఆత్మకూరు డీఎల్‌డీఓ టీ రమణయ్య అన్నారు. మండలంలోని పలు పంచాయతీల్లో జరుగుతున్న స్వామిత్వ సర్వేను సోమవారం ఆయన పరిశీలించారు. సర్వే సిబ్బందికి సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ స్వామిత్వ సర్వే ద్వారా పంచాయతీల్లోని అన్ని రకాల ఆస్తులను సర్వే చేసి వాటి యజమానులకు ఆస్తి హక్కు పత్రాలను మంజూరు చేయనున్నట్లు తెలిపారు. స్వామిత్వ సర్వేకు ప్రజలు సహకరించాలని కోరారు. ఆయన వెంట ఎంపీడీఓ అప్పాజీ, డిప్యూటీ ఎంపీడీఓ కరీముల్లా ఉన్నారు.

టెన్నికాయిట్ క్రీడాకారుల ఎంపిక నేడు

సంగం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో టెన్నికాయిట్ క్రీడాకారుల ఎంపికలను మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించనున్నట్లు ఏపీ టెన్నికాయిట్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీవీ రమణయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీనియర్ బాల, బాలికల విభాగాల్లో క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్లు చెప్పారు. ఎంపికైన క్రీడాకారులను ఈ నెల 13, 14 తేదీల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు స్టడీ సర్టిఫికెట్, ఆధార్ కార్డులతో హాజరుకావాలని కోరారు. వివరాలకు 93900 77858, 94903 20435 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

విద్యతోనే సమాజ అభివృద్ధి

ఉదయగిరి: విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమని జమాతే ఇస్లామీ హింద్ అధ్యక్షుడు షేక్ నస్రుల్లా అన్నారు. స్థానిక దిలావర్‌భాయి వీధిలోని మదర్సాను సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగ సవాళ్లను అధ్యయనం చేసి పరిష్కారం చూపేందుకు ఆంధ్ర ఎడ్యుకేషన్ మూమెంట్ చేపడుతున్నామని తెలిపారు. అనంతరం అందుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు.

ఉపాధి పనుల పరిశీలన

సోమశిల: అనంతసాగరం మండలం కొత్తపల్లిలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ సోమవారం పరిశీలించారు. కూలీలతో సమావేశమై కొలతల ప్రకారం పనులు చేపట్టి ప్రభుత్వం ప్రకటించిన దినసరి వేతనం రూ.307 పొందాలని సూచించారు. పండ్ల తోటల పెంపకంపై దృష్టి సారించాలని క్షేత్రసహాయకులకు సూచించారు. ఆయన వెంట డిప్యూటీ ఎంపీడీఓ రామచంద్రయ్య ఉన్నారు.

సంపద తయారీ కేంద్రాన్ని తొలగించాలని వినతి



ఈఓపీఆర్డీ తో మాట్లాడుతున్న రజకులు

దగదర్తి: తాము పూర్వం నుంచి తమ వృత్తికి వినియోగించుకుంటున్న స్థలంలో అక్రమంగా నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని తొలగించాలని ఉలవపాళ్ల గ్రామానికి చెందిన రజకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయంలో ఈఓపీఆర్డీని సోమవారం కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా రజకులు విలేకరులతో మాట్లాడారు. తాము సమాచార హక్కు చట్టం ద్వారా అధికారులను అడుగగా ఉలవపాళ్లలోని సర్వేనంబర్ 157లో 2018లో ఉపాధి నిధులతో సంపద తయారీ కేంద్రాన్ని నిర్మించినట్లుగా తెలియజేశారన్నారు. కానీ అప్పటి అధికారులు కాంట్రాక్టర్లతో కుమ్మక్కై తమకు తెలియకుండానే తాము దుస్తులు ఉతికేందుకు వినియోగించుకుంటున్న సర్వే నంబర్ 1601లోని భూమిలో అక్రమంగా సంపద తయారీ కేంద్రాన్ని నిర్మించారని తెలిపారు. తమ వృత్తికి వినియోగించుకుంటున్న భూమిలో అక్రమంగా చెత్త ను వేసి ఇబ్బందులకు గురిచేయడం తగదని అధికారులకు మొరపెట్టుకుంటున్నా పట్టించుకోవడం లేదని వాపోయారు. తమ భూమిలో అక్రమంగా సంపద కేంద్రాన్ని నిర్మించి తమపైనే అక్రమ కేసులు పెట్టి అధికారులు బెదిరింపులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు అక్రమార్కులు తమ భూమిని కాజేయాలని చూస్తున్నారని, దయచేసి తమ భూమిని ధోబీఘాట్‌గా రికార్డుల్లో నమోదు చేసి రక్షించాలని కోరారు. రజకులమైన తమను ఇబ్బందులకు గురి చేస్తే రజక సంఘాల ద్వారా పోరాటం చేసైనా సరే తమ భూమిని కాపాడుకుంటామని తెలిపారు.

జీపు ట్రాక్‌ను ఆక్రమించిన కంపచెట్లు



ప్రాంతంలో జీపుట్రాక్‌ను ఆక్రమించిన కంపచెట్లు

ఆత్మకూరురూరల్: మండల పరిధిలో ఉత్తర కాలువ జీపు ట్రాక్‌ను కంపచెట్లు ఆక్రమించడంతో రైతులు పొలాల్లోకి రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఉత్తరకాలువకు ఇరువైపులా భూములు కలిగిన రైతులు జీపుట్రాక్ మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. వ్యవసాయ పనులకు కూలీలను ట్రాక్టర్లు, ఆటోల్లో జీపు ట్రాక్‌మీదుగా తీసుకెళ్తుంటారు. అలాగే వ్యవసాయ ఉత్పత్తులు, ఎరువులను ట్రాక్టర్ల ద్వారా జీపుట్రాక్ మీదుగా తరలిస్తుంటారు. అయితే ఏడాదిన్నరగా కూటమి ప్రభుత్వం ఉత్తర కాలువను పట్టించుకోకుండా వదిలేయడంతో ఉత్తరకాలువ గట్లపై చిల్ల చెట్లు ఏపుగా పెరిగి జీపు ట్రాక్‌ను ఆక్రమించడంతో పొలాల్లోకి రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు పడుతున్నామని రైతులు వాపోతున్నారు. సోమశిల ప్రాజెక్ట్ 4వ డివిజన్ అధికారులు స్పందించి కంపచెట్లను తొలగించాలని కోరుతున్నారు.

ధాన్యానికి మద్దతు ధర కల్పించాలి



ఆత్మకూరు: దళారులు ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకులు కోరారు. ఈ మేరకు రైతులతో కలిసి ఆర్డీఓ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన ప్రదర్శన చేపట్టారు. అనంతరం ఆర్డీఓ బీ పావనికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి వై మధు మాట్లాడుతూ మిల్లర్లు, దళారులు కుమ్మక్కై ఎడగారు ధాన్యాన్ని పుట్టి రూ.15,500కు మాత్రమే కొనుగోలు చేస్తున్నారన్నారు. ధాన్యంలో తేమ పేరుతో బస్తాకు మూడు కేజీలు చొప్పున అదనంగా తీసుకుంటున్నారని తెలిపారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, కౌలు రైతుల పరిస్థితి మరింత దయనీయంగా ఉందన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మద్దతు ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఇండ్ల అంకమ్మ, ఎస్ కొండయ్య, పెంచలయ్య, తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా

– ఇద్దరికి తీవ్ర గాయాలు



వరికుంటపాడు: మండలంలోని వేంపాడు పంచాయతీ భోగ్యం వారిపల్లి వద్ద 565వ జాతీయ రహదారిపై సోమవారం ట్రాక్టర్ బోల్తాపడిన ఘటనలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. బీహార్ రాష్ట్రానికి చెందిన రమేష్, బీర్‌సింగ్ మండలంలో కొత్త విద్యుత్‌లైన్లు ఏర్పాటు చేసే పనులకు వచ్చారు. సోమవారం వారు తిమ్మారెడ్డిపల్లి నుంచి వరికుంటపాడుకు విద్యుత్ స్తంభాలను ట్రాక్టర్‌లో తరలిస్తుండగా భోగ్యంవారిపల్లి వద్ద వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో క్షతగాత్రుల్ని పామూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

కూల్‌డ్రింక్ షాపులో చోరీ

కొండాపురం: కొమ్మిలోని కూల్‌డ్రింక్ షాపులో గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. కూల్‌డ్రింక్ షాపు షట్టర్‌ను గడ్డపారతో పైకి లేపి లోనికి దూరి కూల్‌డ్రింక్ బాటిళ్లు, సిగరెట్లు, నగదును చోరీ చేశారు. సోమవారం ఉదయం షాపు యజమాని బ్రహ్మయ్య చోరీని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కిలో పొగాకు గరిష్ట ధర రూ.315

మర్రిపాడు: డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో సోమవారం 179 పొగాకు బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 224 బేళ్లు రాగా, 179 బేళ్లను విక్రయించామని చెప్పారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.315, కనిష్టంగా రూ.120, సగటున రూ.202.18 ధర పలికిందని వివరించారు.